andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.4 । కనిష్ఠం 19.7
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 8 నవంబరు 2024



నేరాల నియంత్రణలో

సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరం

ఖానాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో నేరాలను నియంత్రించడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఖానాపూర్ సీఐ సైదారావు అన్నారు. గురువారం మండలంలోని మస్కాపూర్ గ్రామంలో గల మసీదులో మసీదు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు భద్రత నిమిత్తం వ్యాపార సముదాయాల ఎదుట, కాలనీల్లో, ఇళ్లల్లో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు.

వ్యాపార సంస్థల్లో అధికారుల తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు కొలతల శాఖాధికారులు

భైంసా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో గురువారం తూనికలు, కొలతల శాఖాధికారులు తనిఖీలు చేపట్టారు. కరీంనగర్ అసిస్టెంట్ కమీషనర్ విజయ సారధి, జిల్లా అధికారిణి భూలక్ష్మీ సారధ్యంలో తూనికల కొలతల శాఖాధికారులు మధ్యాహ్నం వేళలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో పలు వ్యాపార సంస్థల్లో కాంటాలకు స్టాంపింగ్ లేక పోవడాన్ని గుర్తించి కేసులు నమోదు చేశారు. నిబంధనలు విరుద్ధంగానున్న పలు వ్యాపార సంస్థల కాంటాలను స్వాధీన పరుచుకొని జరిమానాలను విధించారు. వ్యాపార సంస్థల నిర్వాహకులు కాంటాలకు తప్పనిసరిగా స్టాంపింగ్‌లు వేయించుకొని ప్రభుత్వ నియమ, నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని కరీంనగర్ అసిస్టెంట్ కమీషనర్ విజయ సారధి సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వెల్లడించారు,

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ముథోల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అభిషేక్ రెజ్లింగ్ అండర్-17 జోనల్ స్థాయి పోటీ ల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ శ్రీనివాస్ తెలిపారు. నేడు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

బ్యాంకు గ్యారెంటీలతో మిల్లర్ల తిరకాసు



- జిల్లాలో డిఫాల్టర్లుగా 17 మిల్లులు
- ఇప్పటి వరకు గ్యారెంటీలు ఇవ్వని మిల్లులు
- సీఎంఆర్‌పై అంతా అయోమయం
- బియ్యం బకాయిలపైనా స్పష్టత కరువు

నిర్మల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రైస్‌మిల్లర్ల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. ఇప్పటికే సీఎంఆర్ ధాన్యం మిల్లింగ్ విషయంలో అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న పలు రైస్‌మిల్లులపై చర్యలు లేకపోవడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మళ్లీ మొదలు కావడంతో సీఎంఆర్ వ్యవహారం తెరపైకి వస్తోంది. జిల్లావ్యాప్తంగా మొత్తం 17 రైస్‌మిల్లులు ధాన్యం విషయంలో నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా అవకతవకలకు పాల్పడడంతో వాటిని డిఫాల్టర్ మిల్లులుగా అధికారులు ప్రకటించారు. ఈ సారి 17 మిల్లులకు సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయింపులు ఉండవని అధికారులు చెబుతున్నారు. మొత్తం జిల్లాలో 76 రైస్‌మిల్లులు గానూ 17 రైస్‌మిల్లులను మినహాయించగా మిగతా రైస్‌మిల్లులకు ఈ సారి సీఎంఆర్ కోసం ధాన్యం కేటాయించాల్సి ఉంది. అయితే ఇప్పటికే చాలా మిల్లులు సీఎంఆర్ పేరిట అవకతవకలకు పాల్పడిన కారణంగా ప్రభుత్వం ధాన్యం కేటాయింపు విషయంలో నిబంధనలను కఠినతరం చేసింది. గతంలో మాదిరిగా కాకుండా ఈ సారి నుంచి బ్యాంకు గ్యారెంటీలను తప్పనిసరి చేసింది. బ్యాంకుల నుంచి గ్యారెంటీ ఇచ్చిన రైస్‌మిల్లులకే సీఎంఆర్ కోసం ఇక నుంచి ధాన్యాన్ని కేటాయించనున్నారు. బ్యాంకు గ్యారెంటీల విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో పాటు పౌర సరఫరాలశాఖ అధికారులు పలుసార్లు సమావేశమై బ్యాంకు గ్యారెంటీ విషయంలో స్పష్టతనిచ్చారు. అయితే సిండికేట్‌గా ఏర్పడ్డ రైస్‌మిల్లుల యాజమాన్యాలు బ్యాంకు గ్యారెంటీల విషయంలో అధికారులకు స్పష్టమైన హామీ ఇవ్వకుండా దోబూచులాట వైఖరిని అవలంభించేందుకు సిద్ధమవుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు ఎలాంటి డిఫాల్టర్ చరిత్ర లేకుండా కేటాయించిన సీఎంఆర్ బియ్యాన్ని సర్కారుకు అప్పజెప్పిన రైస్‌మిల్లులు పది శాతం బ్యాంకు గ్యారెంటీని చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఇప్పటి వరకు 25శాతం పెనాల్టీతో సీఎంఆర్ బియ్యాన్ని అందించిన రైస్‌మిల్లులు 20శాతం బ్యాంకు గ్యారెంటీని ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే 25శాతం సీఎంఆర్ పెండింగ్ ఉన్న రైస్‌మిల్లులు బ్యాంకు గ్యారెంటీని 25శాతం ఇవ్వాలని నిబంధన విధించారు. అయితే ఇప్పటి వరకు ఏ ఒక్క రైస్‌మిల్లు కూడా బ్యాంకు గ్యారెంటీని ఇవ్వకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించడమే కాకుండా ఆ ప్రక్రియను వేగవంతం చేసే పనిలో నిమగ్నమవుతున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 154 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. జిల్లాలో 1లక్ష46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే బ్యాంకింగ్ గ్యారెంటీ నిబంధనను తప్పనిసరి చేయడంతో రైస్‌మిల్లుల యజమానులు మొండికేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని రైస్‌మిల్లుల మినహా మిగతా వారంతా తమకున్న పలుకుబడి పరపతితో బ్యాంకు గ్యారెంటీలపై దోబూచులాట వైఖరిని కొనసాగిస్తున్నారంటున్నారు. మొత్తానికి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమవ్వడం, మిల్లర్లు సీఎంఆర్ మిల్లింగ్ కోసం ముందుకు రాకపోతున్న కారణంతో ఈ సారి గందరగోళ పరిస్థితులు నెలకొనే అవకాశాలు లేకపోలేదంటున్నారు.



డిఫాల్టర్లపై కఠిన చర్యలు కరువు

కాగా జిల్లాలోని 17 రైస్‌మిల్లులు డిఫాల్టర్లుగా అధికారులు ప్రకటించారు.

అయితే ఈ మిల్లులపై అధికారులు కంటి తడుపు చర్యలకే పరిమితం కావడం విమర్శలకు తావిస్తోంది. రైస్‌మిల్లుల యజమానులు తమకున్న పలుకుబడి, పరపతి అడ్డంగా పెట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులున్న సంగతి తెలిసిందే. అధికారులపై పెద్దఎత్తున రాజకీయ ఒత్తిడులు తీసుకువచ్చి గత ఐదారు సీజన్‌ల నుంచి ఈ యజమానులు సీఎంఆర్ విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటున్న కారణంగా పరిస్థితుల్లో మార్పు రావడం లేదంటున్నారు. ప్రతి సీజన్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు రైస్‌మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేసిన బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా దానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారంటున్నారు.

బ్యాంకు గ్యారెంటీల్లో తిరకాసు

ఇదిలా ఉండగా గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ సారి బ్యాంకు గ్యారెంటీ నిబంధనలను అమలులోకి తెచ్చింది. సీఎంఆర్ బియ్యం విషయంలో ఇక కఠినంగా వ్యవహరించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీలను తప్పనిసరి చేసింది. ఎలాంటి ఫిర్యాదులు ఆరోపణలు లేని రైస్‌మిల్లులు సీఎంఆర్ కోసం పదిశాతం బ్యాంకు గ్యారెంటీని ఇవ్వాలని నిబంధన విధించారు. అలాగే మిగతా రైస్‌మిల్లులు 25శాతం వరకు బ్యాంకు గ్యారెంటీలను చెల్లిస్తేనే ధాన్యాన్ని సీఎంఆర్ కోసం కేటాయించనున్నట్లు ప్రకటించారు. అయితే సీఎంఆర్ విషయంలో ఇప్పటికే తలపండిపోయిన రైస్‌మిల్లర్లు ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీలపై విధించిన నిబంధనలను బేఖాతరు చేస్తూ మొండికేస్తున్నారన్న ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి. అయితే కొనుగోలు ప్రక్రియ వేగవంతం కావడంతో సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసే వ్యవహారం కూడా సమస్యగా మారే అవకాశం ఉందని అంటున్నారు. దీనిని అలుసుగా తీసుకుంటున్న రైస్‌మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ విషయంలో దోబూచులాట దోరణిని అవలంభిస్తున్నారన్న విమర్శలున్నాయి.

కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం

ధాన్యం కొనుగోలు ప్రక్రియను అధికారులు వేగవంతం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో పాటు అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్‌లు ఈ మేరకు కొనుగోళ్ళ విషయంలో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్ స్వయంగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమీక్షలు జరుపుతున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలంటూ ఆదేశిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు గ్యారెంటీలు చెల్లించకపోవడంతో రైస్‌మిల్లులకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎలా తరలిస్తారోననే అంశంపై స్పష్టత కనిపించడం లేదంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసే విషయం కూడా సమస్యగా మారనుందని అంటున్నారు. రోజు రోజుకు కొనుగోళ్ళు పెరిగిపోనుండడంతో ఆ ధాన్యాన్ని ఎక్కడ నిల్వ చేయాలన్న సమస్యకు పరిష్కారం క్లిష్టంగా మారే అవకాశం ఉందంటున్నారు.

ఆత్మహత్యల ఘటనలో నిందితుల కోసం గాలింపు

- తండ్రీ కూతురు ఆత్మహత్య ఘటనలో ముమ్మరంగా పోలీసుల దర్యాప్తు
- స్కూటీలో సూసైడ్ నోట్ లభ్యం !?
- సూసైడ్ నోట్‌లో వడ్డీ వ్యాపారుల పేర్లతో పాటు వారి అరాచకాలు
- బాధితురాలికి ఎస్పీ జానకి ఓదార్పు


బాధితుల స్కూటీని పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

బాసర, నవంబరు 7 : (ఆంధ్రజ్యోతి) : వడ్డీ వ్యాపారుల వేధింపులకు బుధవారం బాసర గోదావరి నదిలో నిజామాబాద్‌కు చెందిన తండ్రీ కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాలతో ఈ కేసును పోలీసులు వేగంగా దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ యజమాని ఉప్పలించి వేణు, ఆయన కుమార్తె మృతి చెందగా.. ప్రాణాలతో బయటపడిన అనురాధ చెప్పిన వివరాల ప్రకారం పోలీసులు కేసును పరిశోధిస్తున్నారు. బాధితురాలు ఇద్దరు వడ్డీ వ్యాపారుల పేర్లు చెప్పడం వారు వేధించిన తీరును పరిగణలోకి తీసుకొని పోలీసులు వారి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిసింది. ఇందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు. కానీ ఈ ఘటన వెలుగులోకి రావడంతో ముందే అప్రమత్తమైన నిందితులు పరారీలో ఉన్నారు.

స్కూటీలో సూసైడ్ నోట్ లభ్యం.. ?

అనురాధ చెప్పిన వివరాలతో పాటు ప్రతీ ఆధారాన్ని పోలీసులు ఈ కేసులో పరిశీలిస్తున్నారు. ఇందులో భాగంగా ఇంటి నుంచి బాసర గోదావరి వరకు వచ్చిన స్కూటీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్కూటీలో వేణు ఆత్మహత్యకంటే ముందు రాసిన సూసైడ్ నోట్ పోలీసులకు లభించినట్లు తెలిసింది. పంచనామ చేసి దాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ సూసైడ్ నోట్‌లో కూడా మొదటి నుంచి బాధి తురాలు అనురాధ చెప్పినట్లు నిజామాబాద్‌కు చెందిన వడ్డీ వ్యాపారులు రోషన్, వికాస్‌ల పేర్లు వారు వేధించిన తీరును సూసైడ్ నోట్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వినికిడి. దొరికిన ఈ సూసైడ్ నోట్‌తో ఆత్మహత్యకు కారణమైన బాధ్యులపై పోలీసులు కఠినచర్యలు తీసుకునే అవకాశం ఏర్పడింది. ఈ కేసులో పోలీసులు బాధ్యులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.



బాధితురాలిని ఓదార్చిన ఎస్పీ జానకి షర్మిల

భర్త, కుమార్తె ఆత్మహత్యతో షాక్‌కు గురై భైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనురాధను గురువారం ఎస్పీ జానకి షర్మిల పరామర్శించారు. చాలా సేపు ఆమెతో మాట్లాడి ఓదార్చారు. అధైర్యపడవద్దు.. మేమున్నామంటూ ఎస్పీ భరోసా కల్పించారు.

గోదావరి నదిలో పూర్ణిమ మృతదేహం లభ్యం

బాసర గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్న పూర్ణిమ (25) మృతదేహం గురువారం లభ్యమైంది. బాసర నుంచి నదిలో దూరంగా కొట్టుకుపోయిన మృతదేహాన్ని పోలీసులు కనుగొని వెలికితీశారు. వేణు మృతదేహం బుధవారం నదిలో లభించగా.. అనురాధను స్థానికులు రక్షించారు. ప్రస్తుతం ఆమె భైంసా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పూర్ణిమ మృతదేహం కోసం బుధవారం నుంచి గజ ఈతగాళ్లు నదిలో వెతుకుతూనే ఉన్నారు. నది పొడవునా పడవపై వెతుకున్న గజ ఈతగాళ్లకు బాసర వంతెన నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఆచూకీ దొరికింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

పౌరసేవల ధ్రువీకరణ పత్రాల జారీ త్వరగా పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పౌర సేవల ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పౌర సేవలకు గుర్తింపు పత్రాల జారీలో ఆలస్యం చేయకూడదన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తు పత్రాలను వెంటవెంటనే పరిశీలించాలని తెలిపారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న పౌర సేవల గుర్తింపు పత్రాల దరఖాస్తులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తుల వివరాలను తహసీల్దార్‌లను అడిగి తెలుసుకున్నారు. మండలాలకు సంబంధించిన పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు, ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించిన కోర్టు కేసువివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఉండే విధంగా చూడాలన్నారు. ఇప్పటికే అన్ని మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. తహసీల్దార్లు అంతా క్షేత్రస్థాయిలో దాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. అన్ని మండలాల పరిధిలో గల ప్రభుత్వ భూములకు సంబంధించిన వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులతో భూముల సర్వే నిర్వహించి హద్దులను నిర్ణయించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్‌కుమార్, కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, ఈడీఎం నదీమ్, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్


పీచరలో కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

తాలు తప్ప లేకుండా వరి ధాన్యం ఉండాలి

లక్ష్మణచాంద, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తాలు తప్ప లేకుండా వరి ధాన్యం ఉండాలని కలెక్టర్ గురువారం అన్నారు. మండలంలో పర్యటించిన ఆమె పీచర గ్రామంలో కొనసాగుతున్న తెలంగాణ ఆర్థిక, సాంఘిక కుల గణన సర్వేను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని కిచెన్ గార్డెన్‌ను వీక్షించి ఎంపీడీవో రాధారాథోడ్‌ను అభినందించారు. మధ్యాహ్న భోజనం అందుతున్న తీరుపట్ల స్వయంగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక వరి కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లారు ధాన్యం తేమ శాతాన్ని చూశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్‌వో కిరణ్ కుమార్, సీపీవో జీవా, తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్, ఎంపీవో అమీర్‌ఖాన్, వ్యవసాయ అధికారి పాల్గొన్నారు.

చెరువులను అమ్మేసుకుంటున్నారు!

(5వ పేజీ తరువాయి)

లేదంటున్నారు. అడిగినంత ఇస్తే ఎంతకైనా బరితెగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిషేధిత జాబితాలో ఉన్న 131/7, 131/12 సర్వే నెంబర్లలో అక్రమంగా లే ఔట్‌ను ఏర్పాటు చేసి ప్లాట్లను విక్రయించారు. దీనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు ఆమోదముద్ర వేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసైన్డ్ భూమిలో లేఔట్ చేయడమే కాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో 64 ప్లాట్లను అందినకాడికి దండుకుని అమ్మేసుకోవడం కలకలం రేపుతోంది. ఇప్పటికే ఈ విషయమై సంబంధిత తహసీల్దార్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు కొందరు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పైసలిస్తే ఎంతకైనా బరితెగిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంత జరుగుతున్న జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంపై బిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరు నేతల మద్దతు

మావల చెరువులో జరుగుతున్న భారీ అక్రమాలు, కబ్జాలకు జిల్లా కేంద్రానికి చెందిన ఇద్దరు ముఖ్యనేతల మద్దతు పుష్కలంగా ఉన్న ట్లు తెలుస్తోంది. 131/7, 131/12 సర్వే నెంబర్లలో ఏర్పాటు చేసిన లేఔట్‌కు ఎలాంటి అనుమతులు లేకున్నా రిజిస్ట్రేషన్ చేసే విధంగా అధికారులపై నేతలు ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో ఇద్దరు నేతలకు కోటికి పైగా ముడుపులు ముట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మావల తహసీల్దార్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్‌లు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గినట్లు విమర్శలు వస్తున్నాయి. తలాకొంత పర్సంటేజీలను పంచుకుంటున్న నేతలు చెరువు భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్న అధికారులు మౌనంగానే కనిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, నిఘా లేక పోవడమే ఇలాంటి పరిస్థితికి అసలు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నేతల అండదండలతో కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతునే ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం చుట్టు జరుగుతున్న అక్రమాలు, కబ్జాలపై జిల్లా ఉన్నతాధికారులు లోతుగా దర్యాప్తు జరిపి సంబంధిత అధికారులు, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బోథ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పీజీటీ ఎకనామిక్స్ బోధించేందుకుగాను అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన అభ్యర్థులు సరైన ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 11లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మండల విద్యాధికారిగా పోశెట్టి నియామకం

బోథ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బోథ్ మండల విద్యాధికారిగా సీనియర్ ప్రధానోపాధ్యాయులు కుమ్మరి పోశెట్టిని నియమిస్తూ విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.

రైతులకు సీసీఐ అధికారులు సహకరించాలి

బోథ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోనాల గ్రామంలోని శ్రీ గురుసాహెబ్ చందా జిన్నింగ్ ఫ్యాక్టరీలో సీసీఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న పత్తికొనుగోళ్లను గురువారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మార్కెట్‌కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తేమ విషయంలో అధికారులు రైతులకు సహకరించాలని కోరారు. రైతులు సైతం నాణ్యమైన పత్తిని తేమ శాతం తక్కువ ఉండే విధంగా చూసి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిమ్మింగ్ యజమాని కైలాస్ నాయకులున్నారు.

టీయూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయండి

బోథ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 10న మొట్టమొదటిసారి జరుగనున్న ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మహాసభలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని టీయూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



కొనుగోలు ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించారు. ఆంధ్రజ్యోతిలో పత్తి కొనుగోళ్లపై నిఘా కరువు అనే కథనం ప్రచురితమైంది. జిల్లా కలెక్టర్ రాజర్షిషా గురువారం మార్కెట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ సీసీఐ కేంద్రంలో ముఖ్యంగా రైతులు వారి కుటుంబంలో రక్త సంబంధీకులు ఎవరైనా వచ్చి విక్రయించవచ్చని, ఉదాహరణకు లిస్టు లో భార్యపేరు ఉంటే భర్త వచ్చిన విక్ర యించడానికి అవకాశం ఉంటుం దన్నారు. తల్లి పేరు మీద ఉంటే కుమారుడు కూడా వచ్చి కొనుగోలు చేసుకోవచ్చని, దీంతోపాటు కౌలు రైతు పహాణీ ఇవ్వడం జరుగుతుందని, విక్ర యించడానికి అవకాశం ఉంటుం దన్నారు. ఇప్పటి వరకు సీసీఐ 1253 రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతుల పత్తిని ఆరబెట్టి కొనుగోలు కేంద్రం ఉంటుందన్నారు. సీసీఐ గాని అగ్రికల్చర్ అధికారులు మార్కెట్ అధికారులు ట్రాన్స్‌పోర్ట్‌కు సంబం ధించిన అధికారులు అందరూ అందు బాటులో ఉంటారని ఏమైన సందేహాలుంటే కొనుగోలు కేంద్రంలో ఫ్లెక్సీలో కంట్రోల్ నెంబర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి ఫోన్ చేసి సమ స్యను పరిష్కరించుకోవాలని తెలిపారు. అనం తరం జిన్నింగ్ మిల్‌ను ఆకస్మి కంగా సందర్శించి పత్తికి సంబంధించిన యంత్రాలను పరిశీలించి జిన్నింగ్‌మిల్ యజమాని బజరంగ్‌లాల్‌ను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ గజానన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇచ్చోడ, నవంబరు, 7(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం మహారాష్ట్రలోని కిన్వట్‌కు చెందిన గోవింద్(55) ఆయన భార్య తో కలిసి ఇచ్చోడ మండలం జున్ని గ్రామానికి ద్విచక్రవాహనంపై బయ లుదేరారు. జిన్నిక్రాస్ రోడ్డు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు డీకొ ట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి సమాచారం అందించారు.

కొమురం భీమ్ విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే విరాళం

ఇంద్రవెల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల పోరాట యోధుడు కొమురం భీం విగ్రహం ఇంద్రవెల్లిలో ఏర్పాటుకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ విరాళంగా అందజేసినట్లు కేస్లాపూర్ సార్మేడి మెస్రం వెంకట్రావ్ పటేల్ తెలిపారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇంద్రవెల్లిలో కొమురం భీం విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే తనవంతుగా 50 వేల రూపాయలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొమురం బీమ్ విగ్రహం ఏర్పాటు కమిటీ సభ్యులు మెస్రం చిన్ను పటేల్, కొట్నాక్ బారిక్‌రావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

నేరడిగొండ, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. గురువారం మండలంలోని చించోలి, బంధం గ్రామాలలో సామూహిక గాలికుంటు వ్యాధి నిరోధక కార్యక్రమం నిర్వహించారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి రాథోడ్‌జీవన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల పశుపోషకులు జాగ్రత్త పాటించాలన్నారు.

మహారాష్ట్ర ప్రచారానికి ఆదిలాబాద్ ఎమ్మెల్యే

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 07 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థుల తరఫున ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పలు నియోజకవర్గాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగా క్వినట్ నియోజకవర్గంలో నిర్వహించిన బహిరంగ సభలో మహారాష్ట్ర ఉప ముఖ్య మంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : కలెక్టర్


ఓరల్ చాంపియన్‌షిప్ మొదటి స్థానంలో భద్రాచలం

ఉట్నూర్, నవంబరు7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో మూడు రోజులుగా జరుగుతున్న గిరిజన రాష్ట్రస్థాయి క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యార్థుల చదువుతో పాటు క్రీడల కోసం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. ము ఖ్య అతిథిగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి 320 కోట్లు కేటాయించిందని అన్నారు. గిరిజన విద్యార్థులకు క్రీడల్లో తరిఫీదు ఇవ్వడానికి రాష్ట్రంలో ఏడు ఆదర్శ క్రీడా పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగి భారత దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని ఆకాంక్షించారు. నేటి ఓటమి రేపటికి గెలుపు గాంధీగా తీసుకొని ఓడిపోయిన విద్యార్థులు మరింత ఉత్సాహంతో రాబోయే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో విజయం సాధించడానికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన భద్రాచలం ఐటీ డీఏ విద్యార్థుల బృందానికి, రెండోస్థానం సాధించిన ఉట్నూర్ ఐటీడీఏ విద్యార్థుల బృందానికి ముఖ్య అతిథులు మెమోంటోళ్లు అవార్డులు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ కుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రైని కలెక్టర్ అభిజ్ఞ మాలవీయ, ఇన్‌చార్జీ డీడీ జాదవ్ వసంతరావు, జిల్లా క్రీడల అధికారులు పార్థసారథి, బుక్యరమేష్, మీనారెడ్డి, బండజీవరత్నం, హేమంత్‌నా యక్, మధుసూదన్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి


పెండల్‌వాడలో స్టిక్కర్‌లను అతికిస్తున్న పంచాయతీ సిబ్బంది

జైనథ్, నవంబరు 6 : జైనథ్ మండలంలోని పెండల్‌వాడ, గిమ్మ, జైనథ్, దీపాయిగూడ, ఆనంద్‌పూర్ తదితర గ్రామాల్లో సమగ్ర కుటుంబ కులగణన సర్వే గురువారం ప్రారంభమైంది. ఈ కులగణన సర్వేను జైనథ్ మండల ఎంపీడీవో జి.వెంకట్‌రావ్ మండలంలోని లక్ష్మీపూర్, బెల్లూరి, మాకోడ, బెల్గావ్ గ్రామాలను పరిశీలించారు. దీంతో పాటు మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో ఇంటింటా స్టిక్కర్‌లను అతికించి ప్రజల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నారు. కార్యక్రమంలో పెండల్‌వాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి సూరజ్, కారోబారి కె.బుచన్నలతో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబసర్వేను గ్రామంలోని ప్రతి ఇంటిని సర్వే చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సమగ్ర సర్వేలో భాగంగా గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించా లన్నారు. ముఖ్యంగా గ్రామంలోని ప్రతి ఇంటి వివరాలను ముందస్తుగా నమోదు చేసుకుని ఇంటి వద్ద స్టిక్కర్ అతికించాలన్నారు. సర్వేలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకట్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు కాటిపెల్లి సునీతరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ గజానంద్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. గురువారం మండలంలోని బరంపూర్, అర్లి(కే)లో నిర్వహిస్తున్న కుటుంబ సమగ్ర సర్వే ఇంటింటి వివరాల సేకరణలో భాగంగా సర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రతి ఇంటిని సర్వే చేయించాల న్నారు. అదేవిధంగా సర్వే పట్ల అధికారులు ఎవరూ నిర్లక్ష్యం వహించవద్దన్నారు. గ్రామ ప్రజలకు ఇబ్బంది కలుగకుండా సర్వేచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్యూమనేటర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీ అర్చన పాల్గొన్నారు.

భీంపూర్ : కుటుంబ సర్వే పకడ్బందీగా చేయాలని బీంపూర్ తహసీల్దార్ నలంద ప్రియ అన్నా రు. ఆమె గురువారం మండలంలోని కరంజి (టీ)లో సమగ్ర కుటుంబసర్వే రికార్డులను పరిశీలించారు. ఆమెతో పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఎస్‌జీటీ మూగప్రసూన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.


సర్వే రికార్డులను పరిశీలిస్తున్న నలంద ప్రియ

'ఏ ప్రభుత్వం చేయలేనిది..


కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంది'


లక్ష్మణచాందలో మాట్లాడుతున్న నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

లక్ష్మణచాంద, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో చేపడుతున్న బీసీ కులగణన ఒక చారిత్రాత్మక నిర్ణయం అని ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా చేయలేనిది మా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేయాలని ఎన్నో సంవత్సరాల నుంచి బీసీలు ఎన్నో ఏళ్లుగా ఉద్యమం చేసినప్పటికీ ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్దిరోజుల్లోనే దీనిపై నిర్ణయం తీసుకొని నేడు కులగణన చేయిస్తుండడం హర్షించదగ్గ విషయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కులగణనకు అందరూ సహకరించాలన్నారు. బీసీల కుల గణన పూర్తి అయితే రాష్ట్రంలో బీసీ బిడ్డలకు అనేక రకాలుగా లాభం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిరిపురం నాగేష్, కాంగ్రెస్ బీసీ విభాగం మండల అధ్యక్షుడు ముద్రబోయిన వినేష్, బిట్లింగ్ రజినీకాంత్, సమ్మెట రవి, సుంకరి గంగయ్యలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో సర్వే పకడ్బందీగా చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్


నల్దుర్తిలో సమగ్ర సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

మామడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ప్రతి ఇంటిలో సమగ్ర సర్వే పకడ్బందీగా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారం రోజున మండలంలోని పొన్కల్, నల్దుర్తి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు తనిఖీ చేశారు. సెగ్రిగేషన్ షెడ్డు, శ్మశాన వాటిక, రోడ్లు, డ్రైనేజీ, క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, రాములు, కారోబార్ దయాకర్, సాగర్, ఫీల్డ్ అసిస్టెంట్ గంగ ముత్యం, ఉన్నారు.

కులగణన సర్వేకు వచ్చే అధికారులకు పూర్తి వివరాలు తెలియజేయాలి

ఖానాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి వివరాలు తెలియజేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్ కోరారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

కొనసాగుతున్న ఇంటింటా సర్వే

నర్సాపూర్(జి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్వహిస్తున్న ఇంటింటి సమగ్ర కుటుంబసర్వేను గురువారం రాంపూర్ గ్రామంలో ఎంపీడీవో పుష్పలత పరిశీలించారు. సర్వేలో పొరపాట్లకు తావివ్వరాదన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని ఎన్యూమ రేటర్లకు సూచించారు.

హోటల్, రెస్టారెంట్ల వ్యాపారస్తులు

ప్రభుత్వ నియమాలు ఖచ్చితంగా పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యూష


నిర్మల్ అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : హోటల్, రెస్టారెంట్ల వ్యాపారస్తులు ప్రభుత్వ నియమాలు కచ్చితంగా పాటించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రత్యూష అన్నారు. గురువారం సాయంత్రం నిర్మల్‌లోని మయూరి హోటల్‌లో హోటల్, రెస్టారెంట్, కిరాణా, మిఠాయిల దుకాణాల యజమానులతో ఆమె అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్క ఆహార పదార్థాల, తినుబండారాల తయారీ దారులు ప్రజలకు పరిశుభ్రమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు, వస్తువులు వాడినట్లు తెలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాణ్యమైన ఆహార పదార్థాలను అందించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను, కల్తీ ఆహార పదార్థాలను విక్రయించకూడదని తెలిపారు. ఆహార పదార్థాల తయారీలో కృత్రిమ ఫుడ్ కలర్ వాడకూడదన్నారు. యజమానులందరూ ఆహార పదార్థ విక్రయ లైసెన్స్‌లు కలిగి ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్‌అహ్మద్, హోట్, రెస్టారెంట్, కిరాణా, మిఠాయిల దుకాణాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు ఉద్యమాలు కొనసాగిద్దాం

ఖానాపూర్‌లో ఘనంగా అమరవీరుల సంస్మరణ సభలో వక్తలు

ఖానాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భూమి కోసం, భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం అసువులు బాసిన అమరుల ఆశయ సాధనకై మరిన్ని ఉద్యమాలు కొనసాగిద్దామని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఘనంగా అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అమరులను స్మరిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మాట్లాడుతూ... ఎందరో మంది వీరులు ప్రజల కొరకు పోరాడి తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారన్నారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచన విధానం దృక్పథంగా ఎంచుకొని దోపిడీ వ్యవస్థ నిర్మూలన కోసం వారు చేసిన పోరాటం మరువలేనిదన్నారు. శ్రీకాకుళ గోదావరిలో ప్రతిఘటన పోరాటాలు జరిగాయని ఈ పోరాట క్రమంలో జరిగిన రాజ్యహింసలో అనేక మంది వీర కిశోరాలు నేలకొరిగారన్నారు. అలాంటి అమరుల త్యాగాలను స్మరిస్తూ మరిన్ని పోరాటాలు కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మండల నాయకులు అంకుష్ రావు, జక్కుల రాజన్న, కుంచపు ఎల్లయ్య, గోరేబాయ్, వర్మ, భీమ్‌రావు, జైతు, సుంగు, దేవరావు, చందు, మోహన్, శంఖు, జన, బాదు, సోనేరావు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించటమే సైన్స్ టాలెంట్ పరీక్షల లక్ష్యం


విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించటమే సైన్స్ టాలెంట్ చెకుముకి పరీక్షల లక్ష్యమని ఆ పరీక్షల నిర్వహణ జిల్లా కమిటీ అధ్యక్షుడు రాజర్లనారాయణవర్మ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతి విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించారు. శాస్త్రీ దృక్పథం అలవడటం వలన మూఢనమ్మకాలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అశోక్ చారి, ప్రధానోపాధ్యాయులు రాజు నాయక్, సైన్స్ ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, సురేష్‌బాబు, గణిత ఉపాధ్యాయుడు పెంట అశోక్, తదితరులు ఉన్నారు.

గొల్లమాడలో..

నర్సాపూర్(జి), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గొల్లమాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అత్యధికంగా మార్కులు సాధించిన 8, 9, 10 తరగతుల నుంచి ఒక్కొక్క విద్యార్థి ఈ నెల 21న జరిగే మండల స్థాయి పరీక్షకు హాజరవుతారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు షేక్ రఫీక్, దుర్గా, దీవెన, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పెంబి ఉన్న పాఠశాలలో ..

పెంబి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రతి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించే చెకుముకి టాలెంట్ పరీక్షల్లో భాగంగా గురువారం పెంబి ఉన్నత పాఠశాలలో పాఠశాల స్థాయి పరీక్షలు 8, 9, 10 విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలో 10వ తరగతిలో అక్షిత్, 9వ తరగతిలో శ్రీజ, 8వ తరగతిలో వైశాలి మొదటి స్థానాల్లో నిలిచారు. వీరు ఈ నెల 21వ తేదీన జరిగే మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ పరీక్షలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రామ్ చందర్ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు తిరుపతి, సాయన్న రాజా, శ్రీనివాస్, చంద్రశేఖర్ వర్మలు పాల్గొన్నారు.

తానూర్ , నవంబరు 7 : మండలంలోని ఎల్వీ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు చెకుముఖి పరీక్ష నిర్వహించినట్లు ఇంచార్జీ ప్రధానోపాధ్యాయులు శంకర్ తెలిపారు. సర్ సీవీ రామన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పోటీ పరీక్షలను నిర్వహించడం జరిగిందని, పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ఈ నెల 21వ తేదిన మండలస్థాయిలో నిర్వహించే పరీక్షలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

భర్త వేధింపులతో


భార్య ఉరి వేసుకొని ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు.. వికాసిని (ఫైల్)

మామడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వరకట్నం వేధిం పులకు భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మామడ మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని న్యూ లింగంపల్లి గ్రామానికి చెందిన దేవరశెట్టి వికాసిని(24) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీ సుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన వికాసిని న్యూ లింగంపల్లి గ్రామానికి చెందిన నవీన్‌తో 2019లో వివాహం చేయగా రూ.3 లక్షలు, రెండు తులాల బంగారాన్ని వరకట్నంగా ఇచ్చారు. కొద్దిరోజులు సంసా రం సాఫీగా సాగింది. కొన్ని రోజుల నుంచి నవీన్ తన భార్య ను అదనపు కట్నం రూ. 50,000లు తీసుకురావాలని తరచుగా మానసికంగా, శారీరకంగా వేధించాడు. దీంతో కుటుంబ సభ్యు లు అనేకమార్లు సర్ది చెప్పినా వినలేదు. వేధింపులు ఆగక పోవడంతో మానసికంగా అనేకసార్లు కృంగిపోయి ఆమె ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన స్థలాన్ని డీఎస్పీ గంగారెడ్డి, తహసీల్దార్ సుధాకర్, సీఐ నవీన్‌కుమా ర్‌లు పరిశీలించారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సం దీప్ తెలిపారు.

భార్య ఉరి వేసుకొని చనిపోవడంతో భర్త నవీన్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే రాత్రి భార్యతో గొడవపడి ఉదయం భార్య ఎవరు లేని సమయంలో ఉరి వేసుకున్న సంఘటన విన బడడంతో పరుగుల మందు సేవించి అటవీ ప్రాంతం వైపు వెళ్లగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 108కి సమాచారం ఇచ్చి నిర్మల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అయన చికిత్స పొందుతూ ప్రైవేట్ ఆసుపత్రిలో ఉన్నారని తెలిపారు.

'పోలీసులు అప్రమత్తంగా ఉండాలి'



కుంటాల, నవంబర్, 7 : (ఆంధ్రజ్యోతి) : పోలీసు సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ నేరాల అదుపునకు కృషి చేయాలని అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రం కుంటాల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీసుస్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నేరాల అదుపుకోసం సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ రాత్రి గస్తీలు నిర్వహించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు గురికాకుండా ఉండేందుకు గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈయన వెంట సీఐ నైలు, ఎస్సై భాస్కరాచారి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్ 108 ఉద్యోగికి స్టార్ ఈఎంటీ అవార్డు

ఖానాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ ప్రాంతంలో 108 వాహనంలో ఈఎంటీగా విధులు నిర్వహిస్తున్న తిరుపతికి అవార్డు లభించింది. ప్రథమ చికిత్స విభాగంలో 108లో తిరుపతి అందించిన ఉత్తమ సేవలకు గాను జిల్లా నుంచి స్టార్ ఈఎంటీగా ఎంపిక చేశారు. గురువారం 108 క్లస్టర్ ప్రాజెక్టు మేనేజర్ మధుకర్ కుమార్, జిల్లా ఈఎంఈ లింగాచారిలు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.



ఖానాపూర్ శివారులో నిల్వ చేసిన ఇసుక డంపులను పరిశీలిస్తున్న అధికారుల బృందం

కదిలిన అధికార యంత్రాంగం

- ఖానాపూర్ ప్రాంతంలో అక్రమ ఇసుక, మొరం దందాలపై ఆర్డీవో విచారణ
- నిల్వ చేసిన పది ఇసుక డంపుల సీజ్
- 38 ట్రాక్టర్లకు పైగా ఇసుక ఉంటుందని మైన్స్ అధికారుల అంచనా
- ఇసుక, మొరం అక్రమంగా తరలిస్తున్నారన్నది వాస్తవమన్న ఆర్డీవో
- కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని వెల్లడి



ఖానాపూర్ శివారులో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న ఆర్డీవో రత్న కళ్యాణి, అధికారుల బృందం



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖానాపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక, మొరం అక్రమ తవ్వకాలపై గురువారం ఆంధ్రజ్యోతిలో 'పొద్దంతా పోగేసి రాత్రుల్లో తరలింపు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, మైన్స్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, ఖానాపూర్ తహసీల్దార్ శివరాజ్, డిప్యూటీ తహసీల్దార్ మంజుల తదితర అధికారుల బృందం పట్టణ శివారు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రెంకోని వాగు ప్రాంతం లో జరిపిన ఇసుక తవ్వకాలను, గ్రీన్ ఫీల్డ్ స్టేడియం వెనకాల మొరం తవ్వకాలను జరిపిన ప్రాంతాలను అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఈ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన 10 ఇసుక డంపులను గుర్తించినట్లు ఆర్డీవో రత్న కళ్యాణి తెలిపారు. వాటిని వెంటనే సీజ్ చేయాల్సిందిగా మైన్స్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ స్థానిక తహసీల్దార్ శివరాజ్‌లను ఆదేశించినట్లు ఆర్డీవో పేర్కొన్నారు. అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చిన పది ఇసుక డంపులలో సుమారు 38 ట్రాక్టర్లకు పైగా ఇసుకను నిల్వ చేసినట్లు మైన్స్ అధికారి ఆనంద్ తెలిపారు. ఖానా పూర్ ప్రాంతంలో అక్రమంగా ఇసుక, మొరం తవ్వకాలు జరుగుతున్నది వాస్తవమేనని గుర్తించి నట్లు ఆర్డీవో పేర్కొన్నారు. గుర్తించిన ఇసుక డంపులను సీజ్ చేశామ ని, మొరం తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని సర్వేయర్ ద్వారా సర్వే చేయించి అది ప్రభుత్వ భూమా లేక ప్రై వేట్ భూమా అనేది తేలుస్తామన్నారు. ఈ అక్రమ దందాలకు సంబంధించిన పూర్తి వివరా లతో కూడిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని ఆర్డీవో పేర్కొన్నారు.



క్రీడా సమాచారం

వాలీబాల్ ఫైనల్ మ్యాచ్

హోరాహోరీగా క్రీడా పోటీలు

ఉట్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి గిరిజన సంక్షేమ క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న గిరిజన విద్యార్థిని విద్యార్థులకు ఉట్నూర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో 1600 మంది గిరిజన విద్యార్థులు పాల్గొంటున్నారు. వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, ఖోఖో, టెన్నికాయిట్, ఆర్చరీ, చెస్, క్యారమ్స్ క్రీడా పోటీల్లో రెండు రోజులుగా లీగ్ పోటీలు నిర్వహించిన నిర్వాహకులు మూడో రోజు అయిన గురువారం ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఉట్నూర్ ఐటీ డీఏ వన్, ఏటూరు నాగారం, భద్రాచలం, హైదరాబాద్ ప్లేన్‌వన్, హైదరాబాద్ ప్లేన్ టూ, ఉట్నూర్ ఐటీడీఏ టు పరిధిలోని విద్యార్థులకు నిర్వహించిన పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. ఉట్నూర్ ఐటీడీఏ, ఏటురు నాగారం వాలీబాల్ జట్ల మధ్య రసవత్తర పోరు జరిగింది. ఉట్నూర్ టు ఐటీడీఏ, ఏటు రు నాగారం బాలికల కబడ్డీ జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో నువ్వా నేనా అన్నట్లుగా ఆడారు.

విజేతలు వీరే: మూడు వేల మీటర్ల పరుగు పందెంలో బాలుర 17 ఏళ్ల విభాగంలో విఠల్ ఉట్నూర్ ప్రథమ స్థానంలో నిలువగా అక్షయ్‌కుమార్ భద్రాచలం ద్వితీయ స్థానం, రోహిత్ ఉట్నూర్ ఐటీడీఏ తృతీయ స్థానం సాధించారు. ఏటురు నాగంర ఐటీడీఏకు చెందిన స్వప్న ద్వితీయ స్థానం, ఉట్నూర్ ఐటీడీఏ వన్ నుంచి జలందేవి తృతీయ స్థానం నిలిచారు. డిస్కస్ త్రో 17ఏళ్ల బాలికల విభాగంలో ఉట్నూర్ ఐటీడీఏ వన్ నుంచి సుందరి ప్రథమ స్థానంలో నిలువగా, ఏటూరు నాగారం ఐటీడీఏ నుంచి ప్రణవి ద్వితీయ స్థానం, ఉట్నూర్ ఐటీడీఏ 2 నుంచి మనిషా తృతీయ స్థానం సాధించారు. అదేవిధంగా బాలుర విభాగంలో ఉట్నూర్ ఐటీడీఏ వన్ నుంచి సతీష్ ప్రథమస్థానం, ఏటూరు నాగారం ఐటీడీఏ నుంచి దిలీప్‌కుమార్ ద్వితీయ స్థానం, భద్రాచలం ఐటీడీఏ నుంచి అజయ్ తృతీయ స్థానం సాధించారు. 14ఏళ్ల విభాగం డిస్కస్ త్రోలో ఉట్నూర్ ఐటీడీఏ నుంచి అనిత ప్రథమ స్థానం, ఉట్నూర్ వన్ నుంచి అఖిల ద్వితీయ స్థానం, భద్రాచలం ఐటీడీఏ నుంచి నిహారిక మూడవ స్థానం దక్కించుకున్నారు. అథ్లెటిక్స్‌లో గెలుపొందిన క్రీడాకారులకు అక్కడ అందుబాటులో ఉన్న ఏపీఓ జనరల్ వసంతరావు, డీటీడీఓలు మడావి గంగారాం, అంబాజీజాదవ్‌లతో పాటు జిల్లా క్రీడల అధికారులు కొరెడ్డి పార్థసారథి, భుక్యరమేష్, మీనారెడ్డి, గోవిందరావు, హేమంత్‌నాయక్ తదితరులు ప్రశంస పత్రాలను బహుమతులను అందించారు.

అమ్మవారి భక్తుల మహా పాదయాత్ర

భైంసా, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా నుంచి మహారాష్ట్రంలోని తుల్జాపూర్‌కు గురువారం దుర్గ భవాని అమ్మవారి భక్తుల మహా పాదయాత్ర ప్రారంభమయ్యింది. పది రోజుల పాటు 310 కిలో మీటర్ల మేర పాదయాత్ర కొనసాగనుంది. వేకువ జాము వేళలో స్థానిక గుజ్రిగల్లిలోని మాత .ధర్బార్ నుంచి మా దుర్గా భవాని పరివార్ లఖన్ భయ్యా ఆద్వర్యంలో పాదయాత్ర ప్రారంభమయ్యింది. పట్టణ భక్తులే కాకుండా పరిసర ప్రాంతాలకు చెందిన 500 మందికి పైగా భక్తులు పాదయాత్రగా తుల్జాపూర్ భవాని దర్శనం నిమిత్తం తరలివెళ్లారు. గత 21 సంవత్సరాలుగా అమ్మవారి భక్తులు ప్రతియేటా భైంసా నుంచి తుల్జాపూర్ భవాని మందిరానికి పాదయాత్రగా వెళ్లడం ఆనవాయితీగా జరుగుతోంది.



పాదయాత్రగా వెళ్తున్న అమ్మవారి భక్తులు



ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సమయపాలన పట్టిక



తలమడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి

ఆంధ్రజ్యోతి పరిశీలన



సమయానికి వైద్య సిబ్బంది రాకపోవడంతో వెలవెలబోతున్న ఆసుపత్రి

అంతా మా ఇష్టం

- తలమడుగులో సమయ పాలన పాటించని వైద్య సిబ్బంది
- రోగులకు తప్పని నిరీక్షణ



తలమడుగు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం కోట్లాది రూపాయ లు వెచ్చించి ఆసుపత్రులు నిర్మించి వైద్య సిబ్బందిని నియమించిన ప్పటికీ వైద్య సిబ్బంది గ్రామీణ ప్రజలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంతో వైద్యుల కోసం రోగులు గంటల తరబడి ఎదురు చూడవలసిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్య సిబ్బంది 11 గంటలు దాటితే గాని విధులకు హాజరు కాలేదు. అదేవిధంగా ఆసుపత్రికి మారుమూల గిరిజన గ్రామాల నుంచి రోగులు వచ్చి సిబ్బంది కోసం ఎదురు చూస్తున్నారు. ఆసుపత్రిలో ఒకే ఒక సిస్టర్ హాజరయ్యారు. మిగతా సిబ్బంది 10 గంటల 50 నిమిషాలకు విధులకు హాజరయ్యారు. సాయంత్రం 4 గంటల వరకు ఉండవలసిన సిబ్బంది రెండు గంటలకే వెళుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కాగా మండల వైద్యాధికారి సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సాధించి వైద్య సిబ్బంది సమయపాలన పాటించి గ్రామీణ రోగులకు మె రుగైన వైద్య సేవలు అందించాలని మండల వాసులు కోరుతున్నారు.

జర దేఖో!!





ఇచ్చోడ బస్టాండ్‌లో ఎండలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ఇచ్చోడ బస్టాండ్‌లో అవస్థలెన్నో!

- పడరాని పాట్లు పడుతున్న ప్రయాణికులు
- కనీస సౌకర్యాలు కరువు



బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ఇచ్చోడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూర్చుందామంటే కుర్చీలుండవు. ఎండ నుంచి ఉపశమనానికి నీడ దొరకదు. ఇచ్చోడ మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్ నిర్మల్, హైదరాబాద్ తదితర ఇతర ప్రాతాలకు ప్రయాణించాలంటే బస్టాండ్ బాధలు అనుభవించాల్సిందే. సమయానికి రాని బస్సులతో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందంటే అతిశయోక్తికాదు. దీనికి తోడు బస్టాండ్ సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికుల పరిస్థితి చేప్పనక్క ర్లేదు. ఇచ్చోడ మండల కేంద్రంలో గతంలో ఉన్న పాత బస్టాండ్‌ను త్వరగా పునరుద్ధరిస్తే సమస్య పరిష్కారం అయ్యే అవకాశముందని ప్రయాణికులు, ప్రజలు కొరుతున్నారు. బస్టాండ్‌కు మరమ్మతులు చేయించి బస్టాండ్‌ను త్వరలో ప్రారంభమయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు, ప్రజాప్రతినిధులు చేబుతున్నారే తప్ప బస్టాండ్ పనులు కొనసాగడం లేదు. ఇకనైనా ఆర్టీసీ, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కొరుతున్నారు. ఇచ్చోడలో ఉన్న పాత బస్టాండ్ వినియోగంలోకి వస్తే వాణిజ్య, వ్యాపార సముదాయాలు పెరగడంతో పాటు ఆటో వాలాలకు గిరాకీ ఉంటుందని పట్టణం అభివృద్ధి చెందుతుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రోడ్డు విస్తరణ పనులు ముగిసే సరికి ఆర్టీసీ బస్టాండు బాగు పడితే ఇచ్చోడ పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది.

మెరుగైన వైద్యం కోసం

వైద్యులకు శిక్షణా తరగతులు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ లోని రిమ్స్ సమావేశమందిరంలో గురువారం బేసిక్ బోర్డ్‌మెడికల్ ఎడ్యుకేషన్‌పై నిర్వ హించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. మూడురోజుల పాటు శిక్షణా తరగతులను నిర్వహించగా మహారాష్ట్ర వార్దాలోని జవహర్ లాల్ నెహ్రూ మెడికల్ కళాశాల నుంచి హాజరైన అబ్జర్వర్ డాక్టర్ ఆశిష్ సూచనల మేరకు ప్రొఫెసర్‌లు శిక్షణ ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించడానికి శిక్షణా తరగతులు నిర్వహించి నట్లు డైరెక్టర్ జైసింగ్ తెలిపారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించండి : ఎస్పీ

బోథ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సరిహద్దు గ్రామమైన ఘన్‌పూర్ చెక్‌పోస్టును గురువారం సాయంత్రం ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఫారెస్టు రెవెన్యూ ఎక్సైజ్ చెక్‌పోస్టుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని 24 గంటల పాటు తనిఖీలు చేపట్టాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.

మహిళల ఆర్థిక తోడ్పాటుకు

ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఉట్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్ది, ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళాశక్తి పథకాన్ని ప్రారంభించిందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో ఇందిరా మహిళాశక్తి కోడిపిల్లల పెంపక కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోడిపిల్లల పెంపక కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థిక పరిపుష్టిని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఉట్నూర్ మండలంలోని ఉన్నత పాఠశాలకు అదనపు గదులు మంజూరు చేయించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌ని కోరారు. జడ్పీ హైస్కూల్ హెడ్మాస్టర్ ఆశన్న ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో మన ఊరు మనబడి పథకం ద్వారా నిర్మించిన నాలుగు గదులు సరిపోక ఇబ్బందులు అవుతున్నాయని వివరించారు. పాఠశాలలో 10 తరగతులకు గాను కేవలం 4తరగతి గదులు ఉండడం వల్ల గ్రామ పంచాయతీ కార్యాలయం గదులను ఉపయోగిస్తున్నామన్నారు.

బోథ్ రైతులు ఆందోళన చెందొద్దు

● చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం ● మార్కెట్ కమిటీ చైర్మన్


మాట్లాడుతున్న బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్

బోథ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. బుధవారం రైతులు కొంత మంది రైతు మోహన్‌రెడ్డి అనే రైతును రెచ్చగొట్టారన్నారు. క్రిమిసంహారక మందు డబ్బాను కొనిపించి ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించారని అన్నారు. మార్కెట్ యార్డులో రైతులకు కావాల్సిన అన్ని వసతులు ఏర్పాటు చేశామని రైతులు సమ న్వయంతో వ్యవహరించాలని సూచించారు. భవిష్యత్తులో హమాలీ సమస్య రాకుండా చూస్తా మన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్‌తో పాటు పీఏసీఎస్ సీఈవో గోలి స్వామి ఉన్నారు.

చెరువులను.. అమ్మేసుకుంటున్నారు!


కబ్జాకు గురైన మావల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి ఇదే

- మావల చెరువు ఎఫ్‌టీఎల్ భూముల కబ్జా
- సర్వే నెంబర్ 131/12 నిషేధిత జాబితాలో ఉన్నా అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు
- అసైన్డ్ భూముల్లో లేఔట్ చేసి ప్లాట్ల విక్రయం
- కాసులకు కక్కుర్తిపడి కళ్లు మూసుకుంటున్న అధికారులు

ఆదిలాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా హైడ్రా హడలెత్తిస్తున్నా చెరువు భూముల కబ్జాకు అడ్డుకట్ట పడడం లేదు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రం చుట్టు ఉన్న చెరువులు, కుంటలు, కందకాలు కనుమరుగై అసలు కనిపించకుండానే పోతున్నాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల అండదండతో కబ్జాదారులు మరింతగా రెచ్చిపోతున్నారు. నకిలీ పత్రాలను సృష్టించి జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న విలువైన భూములను దక్కించుకునేందుకు ఎంతకైనా తెగిస్తున్నారు. కోట్ల విలువ చేసే భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తూ అమ్మేసుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను రక్షించేందుకు ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చిన అక్రమాలకు అడ్డుకట్ట పడినట్లు కనిపించడం లేదు. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న మావల, బట్టిసావర్గాం గ్రామ శివారు ప్రాంతంలోని భూముల ధరలకు రెక్కలు వస్తున్నాయి. మావల చెరువు చుట్టు అక్రమాలు జరుగుతున్నా అడిగే వారే కరువవుతున్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎకరాల కొద్ది చెరువు భూములను కబ్జా చేస్తున్న అధికారులు అడ్డుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మావల తహసీల్దార్ కార్యాలయ పరిధిలో అడ్డగోలుగా అక్రమాలు జరుగుతున్నట్లు ఆధారాలతో ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలో మావల తహసీల్దార్ కార్యాలయంలో పని చేసేందుకు తహసీల్దార్‌తో పాటు ఇతర సిబ్బంది పోటీ పడుతున్నారు. గతంలోనూ మావల మండలంలో ఎన్నో అక్రమాలు, కబ్జాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చినా ఉన్నతాధికారులు విచారణ పేరిటా కాలయాపన చేస్తూ వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి.

బై నెంబర్లతో కబ్జా

మావల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొందరు అక్రమార్కులు బై నెంబర్లతో చెరువు భూములను కబ్జా చేస్తున్నారు. సర్వే నెంబర్ 131/7 పరిధిలో 0.2506 విస్తీర్ణం భూమి ఉండగా గతేడు కొత్తగా 131/12 బై నెంబర్‌ను సృష్టించి మరి 9 ఎకరాల లావుని పట్టాతో యథేచ్ఛగా చెరువు భూమిని కబ్జా చేశారు. అయినా అధికారులు చూసీచూడనట్లుగానే వ్యవహరించడం విమర్శలకు దారి తీస్తోంది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు బై నెంబర్‌లు వేస్తూ రిజిస్ట్రేషన్ చేయడం అక్రమార్కులకు అలవాటుగానే మారిందంటున్నారు. కోట్లు విలువ చేసే భూములను కొట్టేస్తున్నా అధికార యంత్రాంగం కళ్లు మూసుకోవడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. మావల తహసీల్దార్ కార్యాలయ పరిధిలోనే వందల కోట్ల విలువ చేసే భూములు మాయం కావడంపై ఫిర్యాదులు వస్తున్నాయి. అసైన్డ్, లావుని, ప్రభుత్వ భూములను గుర్తించి అమ్మేందుకు అసలు వీలు లేకుండా ప్రభుత్వం నిషేధిత జాబితాలో (ప్రొహిబిటెడ్ ల్యాండ్) సర్వే నెంబర్లను ఉంచిన అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేస్తూ అమ్మేసుకుంటున్నారు. అసలు నిషేధిత జాబితా జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్నా యథేచ్ఛగా రిజిస్ట్రేషన్‌లు జరిగిపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్, రిజిస్ట్రేషన్ కార్యాలయ అధికారులు కుమ్మక్కై ఎంతకైనా తెగించడంతో ప్రభుత్వ భూములకు రక్షణే లేకుండా పోతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

రిజిస్ట్రేషన్ అధికారుల బరితెగింపు

ఎన్‌ఓసీ ఉంటేనే ప్రభుత్వ, అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ ఆదిలాబాద్ సబ్ రిజిస్ట్రార్ అధికారులు నకిలీ బై నెంబర్, ఇంటి నెంబర్లతో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్ చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే సంబంధిత మండలాల తహసీల్దార్లు ఎప్పటికప్పుడు నిషేధిత జాబితా సర్వే నెంబర్ల వివరాలను సంబంధిత రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు పంపుతున్నా పరిగణనలోకి తీసుకోవడం

(మిగతా 6వ పేజీలో)


సర్వే నెంబర్ 131/12 పరిధిలో ఏర్పాటు చేసిన లేఔట్ మ్యాప్

సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి

● విజయ్‌కాంత్‌రావు, సబ్ రిజిస్ట్రార్, ఆదిలాబాద్

మావల చెరువు పరిసర ప్రాంతాల్లోని 131/7, 131/12 సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలోనే ఉన్నాయి. డాక్యుమెంట్ ఆధారంగా గతేడు రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. గతంలో కలెక్టర్ ఆదేశాలు లేక పోవడంతోనే రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. ఇటీవల కొత్తగా జిల్లా కలెక్టర్ నిషేధిత జాబితాపై ఆదేశాలు ఇవ్వడంతో రిజిస్ట్రేషన్లను పూర్తిగా నిలిపి వేశాం. ప్రస్తుతం నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నెంబర్లలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

● కె. వేణు, తహసీల్దార్, మావల

నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నెంబర్లలో లేఔట్లను ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. ఆపై అనుమతులు కూడా తీసుకోలేదు. సర్వే నెంబర్ 131/7, 131/12 పరిధిలో ఉన్న భూమిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఎఫ్‌టీఎల్ పరిధిలో లేఔట్‌ను ఏర్పాటు చేసినట్లు తేలితే సంబంధిత యజమానులపై చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నెంబర్ వివరాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అందజేస్తున్నాం. అయినా రిజిస్ట్రేషన్లు జరుగడం అర్థం కావడం లేదు.



మావల చెరువులో సర్వే నెంబర్ల హద్దులను చూపుతున్న గూగుల్ చిత్రం

ఫుడ్‌పాయిజన్ మరణంపై కదిలిన యంత్రాంగం

బోథ్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అధికారులు అసిస్టెంట్ ఫుడ్‌కంట్రోలర్ ఆఫీసర్ తారియానాయక్‌తో పాటు డాక్టర్ శ్రీధర్ మెట్పల్లివార్ డెసిగ్నేచర్ ఆఫీసర్లు సెయింట్ థామస్ పాఠశాలను గురువారం సందర్శించారు. రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఫుడ్‌పాయిజన్ వల్ల మృతి చెందిన ఫుల్ కాళీబైగాకు సంబంధించిన వివరాలను విధుల్లో ఉన్న సిబ్బందిని అడిగి వివరాలు సేకరించారు. అయితే ఫుడ్‌పాయిజన్ వల్ల ఐదుగురు అస్వస్థతకు గురయ్యారన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక మరో నలుగురు ఎక్కడ చికిత్స పొందుతున్నారు అనే విషయం సిబ్బందిని అడిగారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి మాట్లాడుతూ పాఠశాల వంట మనిషిగా పనిచేస్తున్న మృతురాలి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హోటల్ యజమా న్యంపై చర్యలు ఉంటాయని అన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఏఎన్ఎంలు

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 07 (ఆంధ్రజ్యోతి) : గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఏఎన్‌ఎంలకు ఏడునెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఏఎన్‌ఎంలు తమ చంటి పిల్లలను ఎత్తుకొని నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. వేతనంతో కూడిన వారంతపు పండగ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఔట్‌సోర్సింగ్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో విద్యార్థికి తీవ్రగాయాలు


విద్యుత్‌షాక్‌తో తీవ్ర గాయాలైన విద్యార్థి వీరేందర్

ఇంద్రవెల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో విద్యార్థికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండల కేంద్రంలోని పూలాజీ బాబా నగర్‌లో జరిగింది. ప్రత్యేక సాక్షులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని భీంనగర్ కాలనీలో నివాసముంటున్న మసురే సంతోష్, సుకేష్మ దంపతులకు చెందిన కుమారుడు మసురే వీరేందర్ మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి వీరేందర్ మధ్యలోనే బడి ఎగ్గొట్టి తోటి విద్యార్థులతో కలిసి పులాజీబాబానగర్‌లో ఆడటానికి వెళ్లారు. ఆడుతుండగా ఓ భవనంలోకి ఎక్కి భవనంపై వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ వైర్లను పట్టించుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోడుగా ఉన్న విద్యార్థులు కర్రలతో కొట్టి వైర్ల నుంచి తొలగించారు. తీవ్రంగా గాయాలైన విద్యార్థిని వెంటనే మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్సలు అందించారు. 108 అంబులెన్స్ ద్వారా ఆదిలాబాద్‌కు తరలించారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కారణంగానే బడి సమయంలో విద్యార్థులు బయటకు వెళుతున్నారని వారిపైచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యుత్ వైర్లు వేలాడుతున్న విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలి : కలెక్టర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 07 (ఆంధ్రజ్యోతి) : పిల్లలందరూ సమానభావాలు కలిగి ఉండాలని, కులం పరంగా, జాతిపరంగా గాని వర్గ భేదాలు లేకుండా అసమానతలు లేకుండా పిల్లలు సమానభావాలు కలిగి ఉండాలన్నదే స్కౌట్ అండ్ గైడ్స్ ఉద్దేశమని జిల్లా కలెక్టర్ రాజర్షి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సేవదాస్ విద్యామందిర్ వెనుక గ్రౌండ్‌లో స్కౌట్ అండ్ గైడ్స్ డైమాండ్ జూబ్లీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, వైస్ ప్రెసిడెంట్ కాంచనపల్లి రత్నాకర్, కన్నం మోహన్ బాబు, సీనియర్ స్కౌట్ మాస్టర్ రాములు, మున్సిపల్ కమిషనర్ సివిఎన్ రాజు పాల్గొన్నారు. పిల్లలు ఇంగ్లీష్ సబ్జెక్టులో పాసయ్యే విధంగా నాణ్యమైన బోధన అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం పదో తరగతి పరీక్షలకు సంబంధించి నిర్వహించిన ప్రత్యేక కాంప్లెక్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

పత్తి కొనుగోలు ప్రక్రియను పరిశీలన

ఆదిలాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న పత్తి కొనుగోలు ప్రక్రియనను కలెక్టర్ రాజర్షి షా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ అధికారులతో మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు స్వయంగా పత్తి తేమ శాతాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతు లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా మార్కెట్ యార్డులో సౌకర్యా లు చేపట్టాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి...

ఉట్నూర్ : సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. గురువారం ఉట్నూర్ పట్టణంలోని ప్రధా న వీధులలో అధికారులు జరిపిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాలను పరిశీలించారు. మండలంలో ఉన్న ఇండ్లను పూర్తిగా పరిశీలించి ప్రతి ఒక్కరిని రికార్డు చేయాలని సూచించారు. సిబ్బంది విధులకు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, సబ్ కలెక్టర్ మర్మాట్, ట్రైనిక లెక్టర్ అభిజ్ఞ మాలవీయ, ఎం పీడీవో రాంప్రసాద్, ఎంపీఓ పాల్గొన్నారు.

ఉద్యాన నర్సరీ ప్రారంభించిన కలెక్టర్

ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఉద్యానవన కేంద్రం ఆధ్వర్యంలో ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేసిన ఉద్యానవన నర్సరీని గురువారం కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు. పండ్ల తోటల ఉద్యానవన నర్సరీలో ప్రజలకు అవసరమయ్యే మొక్కలను అభివృద్ధి చేసి గిరిజనులకు ప్రత్యామ్నయం ఉపాధి కలిగించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పీఓ ఖుష్బు గుప్తా, సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రైని కలెక్టర్, పీహెచ్‌సీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నేతకాని కులస్తుల నిరసన

గుడిహత్నూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి నేతకాని కులస్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి రవీందర్ డిమాండ్ చేశారు. నేతకాని సమాజాన్ని మాల ఉప కులంగా మాల నేతకానిగా కులగణనలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వివేక్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేత కాని యువజన విభాగం జిల్లా అధ్యక్షులు జునుగురు మహేష్, సభ్యులు బోర్లాకుంట సురేష్, జాడి శంకర్, బోర్లకుంట రవి, బొర్కార్ రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.